నేటినుండి అగ్నినక్షత్రం ప్రారంభం



చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అధిక ఎండలు కాసే అగ్ని నక్షత్రం ఆదివారం ప్రారంభం కానుంది. ఈ నెల 28వ తేది వరకు కొనసాగనున్న అగ్నినక్షత్రం ప్రభావంతో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది అగ్ని నక్షత్రం ప్రభావం మూడు విధాలుగా ప్రభావం చూపుతోంది. ఆ ప్రకారం, ఆదివారం నుంచి ఎండ తీవ్రత పెరగనుంది. అలాగే గాలిలో తేమ శాతం తగ్గడంతో ప్రజలకు ఉక్కపోత ఖాయం. ఉత్తర, అంతర్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. ఈ ప్రకారం, మదురై, వేలూరు, తిరుచ్చి, ఈరోడ్, సేలం, కరూర్, పెరంబలూరు, అరియలూరు, విరుదునగర్ తదితర జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 2-3 డిగ్రీల వరకు పెరగనున్నాయి. అగ్ని నక్షత్రం మొదటి విధానంలో ఆదివారం నుంచి ఎండ తీవ్రత క్రమంగా అధికమవుతోంది. 11 నుంచి 20వ తేది వరకు ఎండ మరింత పెరుగుతుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొన్ని ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం కూడా ఉందని, వృద్ధులు, పిల్లలు సాధ్యమైనంత వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావొద్దని వైద్యులు సూచిస్తున్నారు.

వర్షాలు కూడా...

అగ్ని నక్షత్రంతో ఎండలు భగ్గుమంటున్న నేపథ్యంలో, మరోవైపు అక్కడక్కడా వర్షాలు కూడా పడే అవకాశం ఉంది. దక్షిణ భారత ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి, పశ్చిమ, తూర్పు గాలులు కలవడం తదితర కారణాలతో రాష్ట్రంలో ఈ నెల 5,6 తేదీల్లో వర్షాలు కురువనున్నాయి. కోవై, తిరునల్వేలి జిల్లాల్లోని కొండ ప్రాంతాలు, నీలగిరి, విరుదునగర్, తేని, తెన్‌కాశి, మదురై, దిండుగల్, కరూర్ తదితర ఐదు జిల్లాల్లో 5వ తేది భారీవర్షం కురువనుంది. 6వ తేది నీలగిరి, ఈరోడ్, తేని, దిండుగల్, తెన్‌కాశి, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు తదితర జిల్లాల్లో భారీ వర్షం కురవనుంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల్లో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో రాత్రి, తెల్లవారుజామున తేలికపాటి వర్షం కురిసే అవకాశముందని, పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.





సీఎంకు వెండిదండకాన్ని బహూకరిస్తున్న దృశ్యం

మూఢనమ్మకాలను పెంచే విద్యా సంస్థలపై కఠిన చర్యలు

● విద్యావేత్తలు జ్ఞానాన్ని, సామాజిక న్యాయాన్ని అందించాలి ● సత్కార సభలో సీఎం స్టాలిన్

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): మూఢనమ్మకాలకు, కులాలకు, మతాలకు ప్రాధాన్యమిచ్చే విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హెచ్చరించారు. విద్యావేత్తలు, విశ్వవిద్యాలయాల నిర్వాహకులు విద్యార్థులకు అపరిమితమైన జ్ఞానాన్ని, సామాజిక న్యాయాన్ని అందించేలా పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో శనివారం రాత్రి విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించే అధికారం ముఖ్యమంత్రికి దక్కేలా ఉత్తర్వులు పొందటం, మరిన్ని రాష్ట్ర హక్కులను సాధించేలా న్యాయపోరాటం ద్వారా సుప్రీంకోర్టులో విజయం సాధించినందుకుగాను స్టాలిన్‌కు స్వయం ప్రతిపత్తి విశ్వవిద్యాలయాల ఛాన్సలర్లు, వైస్ ఛాన్సలర్లు, మాజీ వైస్ ఛాన్సలర్లు, విద్యా సంస్థలు అధినేతలు, అధ్యాపకులు, విద్యావేత్తలు, విద్యార్థుల సంయుక్త ఆధ్వర్యంలో ద్రావిడ కళగం నేత కె.వీరమణి అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో స్టాలిన్ మాట్లాడుతూ.. స్వయంప్రతిపత్తి విశ్వవిద్యాలయాల అధినేతలు, విద్యార్థులంతా కలిసి తనను సత్కరించడానికి తాను పొంగిపోవటం లేదని, విద్యారంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందనే తన భవిష్యత్ బాధ్యతలు గుర్తు చేస్తోందన్నారు. సత్కార సభ ఆహ్వాన పత్రికలో పేర్కొన్నట్లు రాష్ట్ర స్వయంప్రతిపత్తి నాయకుడిని తాను కాదని, తమిళ ప్రజలేనని స్పష్టం చేశారు. పది బిల్లులను పెండింగ్‌లో ఉంచిన గవర్నర్ తీరుకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించి చక్కటి తీర్పు సాధించడం తన విజయంగా భావించడం లేదని, అదంతా సమష్టి విజయమన్నారు. ఆ తీర్పు తమిళనాడుకు మాత్రమే పరిమితం కాదని, అన్ని రాష్ట్రాలకు వర్తిస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేలా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు గొప్పదనాన్ని లోకానికి ఎలుగెత్తి చాటాలనే ఆలోచనతోనే ఈ సత్కారసభకు తాను అంగీకరించానని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి ఏజెంటులా వ్యవహరిస్తూ, రబ్బర్ స్టాంపు పదవిలో ఉన్న గవర్నర్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వానికి అడ్డుగా నిలవటం భావ్యమేనా అనే విషయాన్ని విద్యార్థి లోకం ఆలోచించాలన్నారు. భావిభారత పౌరులను అందించే విశ్వవిద్యాలయాలపై అన్ని వసతులు కల్పించే ప్రభుత్వానికి ఎలాంటి అధికారాలు లేకుండా గవర్నర్ ఆ విశ్వవిద్యాలయాలకు వీసీలను నియమించడం భావ్యమేనా అని ప్రశ్నించారు. ఈ ఆలోచనల వల్లే తాను సుప్రీంకోర్టుకు వెళ్ళి ఎన్నికైన ప్రభుత్వాల బిల్లులను గవర్నర్ ఆమోదించడానికి గడువుని ప్రకటించేలా తీర్పు సాధించినట్టు చెప్పారు. ఈ తీర్పు ద్వారా రాష్ట్రపతి బిల్లులను ఆమోదించడానికి కూడా ఈ తీర్పు ద్వారా ప్రకటించిన గడువు వర్తిస్తుందన్నారు. ప్రధానికి గల హక్కులను రాష్ట్రపతి తీసుకుంటే ఊరుకుంటారా? అని కేంద్ర ప్రభుత్వానికి స్టాలిన్ ప్రశ్నించారు. గవర్నర్‌తో వ్యక్తిగత విభేదాలు, విరోధాలు లేవని, ఆయన అనుసరించిన విధానాలనే వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కొత్త గవర్నర్ వచ్చి ఈ విధంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. ఇటీవల రాష్ట్రహక్కుల సాధనకోసం ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలను పెంచే దిశగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఇటీవల తన అధ్యక్షతన జరిగిన వీసీల సదస్సులో విదేశీ విద్యార్థులు కూడా రాష్ట్రానికి వచ్చి చదివేలా విద్యా ప్రమాణాలు పెంచాలని విజ్ఞప్తి చేశానని చెప్పారు. మతతత్త్వ శక్తులపై విద్యార్థులు ఆచితూచి వ్యవహరించాలనిచ విద్యలో జాతి, కుల ద్వేషాలు ఉండకూడదన్నారు.

దేశానికే దిక్సూచి స్టాలిన్...

స్వయంప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాలల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌ఎస్ మునిరత్నం స్వాగతోపన్యాసం చేస్తూ.. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌ను సత్కరించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర హక్కులను కాపాడటానికి చేస్తున్న పోరాట యోధుడు స్టాలిన్ అని కొనియాడారు. వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ.. తాను లయోలా కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి స్టాలిన్‌ను ఐదేళ్ల ప్రాయం నుండే చూశానని, డీఎంకే యువజన విభాగం నేతగా, మేయర్, మంత్రిగా, డీఎంకే అధ్యక్షుడిగా , డిప్యూటీ సీఎంగా, ముఖ్యమంత్రిగా అంచెలంచెలుగా కష్టపడి ఎదిగారన్నారు. ప్రస్తుతం స్టాలిన్ భారతదేశానికే దిక్సూచిగా మారారని ప్రశంసించారు. అందరూ ఆమోదించే విధంగా విద్యావిధానం ఉండాలన్నదే తన ఆకాంక్ష అని చెప్పారు. ఈ సభలో తంజావూరు విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్ ఎం. రాజేంద్రన్, భారత్ విశ్వవిద్యాలయం చైర్మన్ ఎస్.జగద్రక్షకన్, తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కే నారాయణసామి, కారైక్కుడి అళగప్పా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ జి.రవి, అన్నా విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ మన్నర్ జవహర్, ఎస్ఐఈటీ విద్యాసంస్థ సలహాదారు జస్టిస్ జీఎం అక్బర్ అలీ, మదురై త్యాగరాజర్ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ హరి కె.త్యాగరాజన్, వేలూరు తిరువళ్లువర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ టి.ఆరుముగం, మద్రాసు విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ జి.తిరువాసగం, జయా ఇంజనీరింగ్ కళాశాలల వ్యవస్థాపకుడు ప్రొ ఫెసర్ ఎ.కనకరాజ్, ఆర్‌ఎంకే విద్యా సంస్థల గ్రూపు ఉపాధ్యక్షుడు ఆర్‌ఎం.కిషోర్, సాయిరామ్ విద్యా సంస్థల గ్రూపు చైర్మన్ సాయి ప్రకాష్ లియోముత్తు, ఉన్నతవిద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ సహా రాష్ట్ర మంత్రు లు, ఎంపీలు కనిమొళి, తిరుచ్చి శివా, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

‘నీట్’కు పటిష్ఠమైన ఏర్పాట్లు

● రాష్ట్రం నుంచి 1.5 లక్షల మంది హాజరు ● పరీక్షా కేంద్రాల్లో కఠిన నిబంధనలు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): యూజీ వైద్య కోర్సుల్లో 2025-26వ విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన ‘నీట’ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు జరుగనుంది. ఈ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ఫిబ్రవరి 7 నుంచి మార్చి 7వ తేది వరకు కొనసాగింది. ఈ పరీక్ష రాసేందుకు దేశవ్యాప్తంగా 22 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, రాష్ట్రం నుంచి 1.5 లక్షల మంది హాజరుకానున్నారు. ఆంగ్లం, కన్నడం, మలయాళం, తమిళం, తెలుగు, ఉర్దూ సహా 13 భాషల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 720 మార్కులకు పరీక్ష జరుగనుంది. పరీక్షా కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు హాల్ టిక్కెట్లలో సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 11.30 గంటల నుంచి విద్యార్థులను అనుమతించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల్లోపు విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉండగా, ఆ తరువాత వచ్చిన వారిని అనుమతించరు. విద్యార్థులు హాల్ టిక్కెట్లు, ప్రభుత్వం అందజేసిన గుర్తింపు కార్డు తప్పక తీసుకురావాల్సి ఉంది. సెల్‌ఫోన్లు, చేతి గడియారాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించరు. ఫుల్ షర్ట్, బెల్ట్, కోటు, ముక్కుపుడక ధరించ కూడదు. విద్యార్థినులు జడ వేసుకోకూడదనే పలు నిబంధనలు విధించారు. రాష్ట్రంలో చెన్నై, మదురై, తిరుచ్చి సహా 31 జిల్లాల్లో పరీక్ష జరుగనుంది. చెన్నైలో ఏర్పాటుచేసిన 44 పరీక్షా కేంద్రాల్లో 21,960 మంది పరీక్ష రాయనున్నారు. అదే సమయంలో తేని, పెరంబలూరు, తెన్‌కాశి, రాణిపేట, కళ్లకుర్చి, మైలాడుదురై, తిరుపత్తూర్ తదితర 7 జిల్లాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయలేదు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్లు, వైద్య చికిత్స శిబిరాలు ఏర్పాటయ్యాయి.



జేపీ నడ్డా, పొంగులేటి సుధాకర్‌రెడ్డితో బీజేపీ రాష్ట్ర నాయకులు

కూటమి బలోపేతానికి కృషి చేయండి

● బీజేపీ కేంద్ర కమిటీ సమావేశంలో జేపీ నడ్డా

ప్యారీస్, మే 3 (ఆంధ్రజ్యోతి): మెజారిటీ స్థానాల్లో విజయం సాధించేలా ఎన్‌డీఏ కూటమిని మరింత బలోపేతం చేసేందుకు కృషిచేయాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర నేతలకు సలహా ఇచ్చారు. కాట్టాన్ కొళత్తూరులోని ఓ హోటల్‌లో నిర్వహించిన బీజేపీ కేంద్ర కమిటీ సమావేశంలో జేపీ నడ్డా పాల్గొని, వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి జరగబోయే ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్నివర్గాల ప్రజలకు అందిస్తున్న పథకాలను ప్రచార రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. బూత్ కమిటీల ఏర్పాటు, అన్నాడీఎంకే పొత్తు మరింత బలోపేతం తదితర విషయాలపై నడ్డా ఈ సమావేశంలో చర్చించారు. బీజేపీ-అన్నాడీఎంకే కూటమిలో చేరేందుకు ఏఏ పార్టీలు ఆసక్తి చూపుతున్నాయి?, ఆ పార్టీ బలం, పనితీరుపై నడ్డా రాష్ట్ర నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, రాష్ట్ర ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కేంద్ర మాజీమంత్రి పొన్ రాధాకృష్ణన్, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై, ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్, హెచ్.రాజా, రామలింగం, కేశవ వినాయగం తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశం అనంతరం ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగబోయే ఎన్నికలను పురస్కరించుకుని అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు కుదుర్చుకోవడంపై రాష్ట్రప్రజల్లో కలిగిన అభిప్రాయాలను నడ్డా అడిగితెలుసుకున్నారని తెలిపారు. సమష్టి కృషితో కూటమిని అధికసీట్లలో గెలిపించి అధికారంలో కూర్చోబెట్టేందుకు ప్రతి కార్యకర్త ఇప్పటినుండే సైనికుడిల పని చేయాలని ఈ సమావేశం ద్వారా నడ్డా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసారని ఆమె తెలిపారు.

వ్యవస్థలతో కక్ష సాధింపు చర్యలా?

● కేంద్రంపై సీఎం స్టాలిన్ ఫైర్
● 1న డీఎంకే సర్వసభ్య సమావేశం



సమావేశంలో స్టాలిన్ తదితరులు

అడయార్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆదాయపన్ను (ఐటీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ వంటి వ్యవస్థలను కక్ష సాధింపు చర్యలకు ప్రయోగిస్తారా అని కేంద్ర ప్రభుత్వం తీరుపై ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో శనివారం జరిగింది. పార్టీ సీనియర్ నేతలు దురైమురుగన్, టీఆర్ బాలు, కేఎన్ నెహ్రూ, శేఖర్‌బాబు, సుబ్రహ్మణ్యం, రాజాతో పాటు పార్టీ సీనియర్ నేతలు, అన్ని జిల్లాల కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ, జూన్ ఒకటో తేదీ పార్టీ సర్వసభ్య సమావేశం జరుగుతుందని, అదే రోజున మదురైలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని చెప్పారు. దాని తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 1,244 ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహించేలా ఈ సమావేశంలో తీర్మానించినట్టు వెల్లడించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ వంటి స్వతంత్ర వ్యవస్థలను తమ స్వలాభం కోసం విపక్ష పార్టీల నేతలపై కక్ష సాధింపు చర్యలకు ప్రయోగిస్తూ, దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. ఇదే అంశంపై బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక తీర్మానం చేశారు. అదేవిధంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను పార్టీ అధిష్ఠానమే ఎంపిక చేస్తుందన్నారు. అలాగే, రాష్ట్ర మంత్రులు ఇక నుంచి నగరంలో ఉండటం కంటే తమతమ సొంత జిల్లాల్లో ఉంటూ పార్టీ శ్రేణులను అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. బీజేపీ ఏదో రూపంలో రాష్ట్రంలో అధికారంలోకి రావాలని చూస్తోందన్నారు. దాని ఎత్తుగడలను విఫలం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి భయంతోనే బీజేపీతో చేతులు కలిపారన్నారు. అయితే, మన బలమే ఐకమత్యం అన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో గవర్నర్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ తీర్మానం చేశారు. అంతేకాకుండా, దేశ ఆర్థిక వృద్ధి రేటు 6.5 శాతం కాగా, తమిళనాడు వృద్ధి రేటు 9.69 శాతం అని ఆయన వెల్లడించారు. నికర వృద్ధిలో దేశంలో రెండో రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందన్నారు. దేశంలోనే అత్యధిక పరిశ్రమలు కలిగిన రాష్ట్రంగా, రూ.5.35 లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షించిన రాష్ట్రంగా మన ప్రభుత్వ హయాంలో తమిళనాడు నిలిచిందని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.



నేత్రపర్వంగా 63 నాయన్మార్ల ఉత్సవం

● తిరుక్కలికుంద్రంలో భక్తుల పరవశం

ప్యారీస్, మే 3 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా తిరుక్కలికుంద్రంలో ప్రసిద్ధి చెందిన వేదగిరీశ్వరాలయంలో చిత్తిరై బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం 63 మంది నాయన్మార్ల ఊరేగింపు ఘనంగా జరిగింది.. త్రిపురసుందరీ సమేత వేదగిరీశ్వర స్వామివారు కొలువుదీన ఈ ఆలయానికి 700 సంవత్సరాల చరిత్ర ఉంది. వేదంవల్లించే కొండ, పక్షితీర్థం, శంఖుతీర్థం, ఇంద్రపురి, వేదపురి ఇలా పలు పేర్లతో పిలవబడే ఈ ఆలయంలో ప్రతిఏటా చిత్తిరై మాసం ఉత్సవాలు కోలాహలంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది మే 1న చిత్తిరై బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన 63 నాయన్మార్ల ఉత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. నాయన్మార్లకు ఉదయం అభిషేక, అర్చన, అలంకారం, మహాదీపారాధన శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత పార్వతీ,పరమేశ్వరులతో పాటు వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, 63 నాయన్మార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథాల్లో కొలువుదీర్చారు. వేదమంత్రోచ్చారణ, మేళతాళాల మధ్య ఆలయ ప్రధాన ప్రవేశ ద్వారం నుంచి కదిలిన ఊరేగింపు గిరిప్రదక్షిణ మార్గం మీదుగా తిరిగి ఆలయవద్దకు చేరుకుంది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక సంస్థల ఆధ్వర్యంలో ఊరేగింపు సాగిన మార్గంలో చలువ పందిళ్లలో భక్తులకు మజ్జిగ, తాగునీరు, అన్నదానం పంపిణీ చేశారు.



7న పంచ రథోత్సవం...

చిత్తిరై బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన పంచ రథోత్సవం జరుగనుంది. ఇందులో వినాయకుడి రథం ముందు ఉంటుంది. ఆ తర్వాత సుబ్రమణ్యస్వామి, త్రిపురసుందరి, వేదగిరీశ్వరుడు, చండికేశ్వరుల రథోత్సవం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా చెంగల్పట్టు జిల్లా నుండి తిరుక్కలికుంద్రంకు ప్రభుత్వం రవాణా సంస్థలు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాయి.

సమాచార ధ్వని

తంజావూరు విశ్వవిద్యాలయంలో రేపటి నుంచి బీఎడ్,ఎంఎడ్ అడ్మిషన్లు

ప్యారీస్, మే 3 (ఆంధ్రజ్యోతి): తంజావూరు తమిళ విశ్వవిద్యాలయంలో 2025-2026వ విద్యాసంవత్సరానికి సంబంధించి బీఎడ్,ఎంఎడ్ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 5 నుంచి ప్రారంభమవుతుందని రిజిస్ట్రార్ కె.పన్నీర్ సెల్వం తెలిపారు. ఈ విశ్వవిద్యాలయంలో బీఎడ్, ఎంఎడ్ రెండేళ్ళ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి జూన్ 31వ తేదీ వరకు అడ్మిషన్లు జరుగుతాయి. ఆగష్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని రిజిస్ట్రార్ ప్రకటించారు. మరిన్ని వివరాలకు www.tamiluniversity.ac.in, 04362-226720, 750217760 నెంబర్లలో సంప్రదించవచ్చు.

8న చాక్లెట్ తయారీపై శిక్షణ

పెరంబూర్, మే 3(ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ సమాచార, శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 8న చాక్లెట్ల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. గిండిలోని కేంద్రం కార్యాలయంలో మాంటి చాక్లెట్, మిల్కీ బార్, బాదం చాక్లెట్ సహా పలు రకాల చాక్లెట్ల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి కలిగిన వారు 044-29530048 అనే నెంబరు సంప్రదించవచ్చని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

'వాకీటాకీ'లో జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో, పోలీసుల జన్మదినం, వివాహం రోజున పోలీసు కంట్రోల్ రూమ్ నుండి వాకీటాకీ ద్వారా శుభాకాంక్షలు తెలపాలని డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. ఈ మేరకు డీజీపీ జిల్లా ఎస్పీలకు పంపిన సర్క్యులర్‌లో... పోలీసులు తమ జన్మదినం, వివాహ దినం రోజున కుటుంబసభ్యులతో గడిపేలా సెలవు మంజూరు చేయాలన్నారు. పోలీసుల ఆరోగ్య భద్రతకు, కుటుంబ సభ్యులతో తగిన సమయం వెచ్చించేలా వారికి వారంలో ఒక రోజు సెలవు ఇవ్వాలని, సెలవు వద్దన్న పోలీసులకు ఓవర్ టైం వేతనం ఇవ్వాలని డీజీపీ సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

కొడైకెనాల్ 'సైట్ సీయింగ్ బస్సులు'

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ మదురై ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో కొడైకెనాల్‌లో ప్రకృతి అందాలను వీక్షించేలా ఈ నెల 1 నుంచి 31వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. కొడైకెనాల్ అప్పర్ లేక్ వ్యూ, మోయిర్ పాయింట్, పైన్ ఫారెస్ట్, గుణ గుహ, ధన్ రాక్, గ్రీన్ వాలీ, పంబారు వ్యూ, కాకర్స్ వాక్, బ్రయాంట్ పార్క్, లేక్ ఏరియా వంటి ప్రదేశాలకు ఈ బస్సుల్లో వెళ్లవచ్చు. కొడైకెనాల్ బస్టాండ్ నుంచి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గంటకు ఒక బస్సు బయల్దేరనుంది. ఈ బస్సులో పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.75 ఛార్జీగా నిర్ణయించారు. టిక్కెట్లు ఆన్‌లైన్‌లో గాని, వ్యక్తిగతంగాను, బల్క్ బుకింగ్ ద్వారా కొనుగోలు చేయవచ్చని అధికారులు తెలిపారు.

నెల రోజుల్లో రూ.505.27 కోట్ల ఆస్తి పన్ను వసూలు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో 30 రోజుల్లో రూ.505.27 కోట్ల ఆస్తి పన్ను వసూలైంది. జీసీసీ పరిధిలో 13 లక్షల మంది ఆస్తుల యజమానులున్నాయి. ఈ ఏడాదికి సంబంధించి తొలి అర్ధవార్షిక పన్ను ఏప్రిల్ 1 నుంచి 30వ తేదిలోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామని జీసీసీ ప్రకటించింది. ఆ ప్రకారం, 2025-26 ఆర్థిక సంవత్సరానికి తొలి అర్ధవార్షిక పన్ను ఏప్రిల్ 30వ తేదిలోపు 4 లక్షల మంది చెల్లించి రాయితీ పొందారని జీసీసీ రెవెన్యూశాఖ అధికారి భానుచంద్రన్ తెలిపారు.

చెన్నై సెంట్రల్-రాజస్తాన్ మధ్య కొత్త సూపర్‌ఫాస్ట్ రైలు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-రాజస్తాన్ రాష్ట్రం భగత్ కి కోఠి మధ్య కొత్తగా సూపర్ ఫాస్ట్ రైలు నడిపేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపిందని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.20625 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భగత్ కి కోఠి సూపర్ ఫాస్ట్ రైలు ఈ నెల 5వ తేది నుంచి (బుధ, శనివారాలు మినహా) చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 7.45 గంటలకు బయల్దేరి మూడవ రోజు మధ్యాహ్నం 12.15 గంటలకు భగత్ కి కోఠి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.20626 భగత్ కి కోఠి-చెన్నై సెంట్రల్ సూపర్ ఫాస్ట్ రైలు (మంగళవారం, శనివారం మినహా) భగత్ కి కోఠిలో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.15 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది.

'వందే భారత్'కు అదనపు బోగీలు...

చెన్నై ఎగ్మూర్-నాగర్‌కోయిల్-చెన్నై ఎగ్మూర్ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన లభించింది. ఈ క్రమంలో, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 8 నుంచి ఈ రైళ్లకు నాలుగు చైర్ కార్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలియజేసింది.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించే ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు చేపడతామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. 2024-25 విద్యా సంవత్సరానికి అన్ని తరగతులకు వార్షిక పరీక్షలు ముగియడంతో పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, చెన్నై, నామక్కల్ సహా పలు జిల్లాల్లోని ప్రైవేటు పాఠశాలలు రానున్న విద్యా సంవత్సరంలో ప్లస్ వన్, ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖకు ఫిర్యాదులందాయి. ఈ విషయమై విద్యాశాఖ విడుదల చేసిన ప్రకటనలో... రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరించిందని, ఈ కాలంలో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు అనారోగ్యం పాలయ్యే అవకాశముందన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని, నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు చేపడతామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది.

ద్రావిడ సాహిత్యంపై కొత్త కోర్సు

అడయార్, మే 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారి ద్రావిడ సాహిత్యం, జర్నలిజంపై సేలం పెరియార్ విశ్వవిద్యాలయంలో పీజీ కోర్సు ప్రవేశపెట్టారు.ఈ వర్సిటీలో 25కు పైగా కోర్సుల్లో విద్యాబోధన సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ వర్సిటీలో కొత్తగా ముత్తమిళ్ అరింజ్ఞర్ తమిళ్‌వేల్ కలైంజర్ ఎం.కరుణానిధి పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పారు.దీని తరఫున తొలిసారి 'ద్రావిడ సాహిత్యం - పత్రికా రచన' అనే పాఠ్యాంశంపై ఈ కొత్త కోర్సు ప్రారంభించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాల కోసం 94442 04387, 80121 93831 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించి తెలుసుకోవచ్చు.

తిరునల్వేలిలో భారీ వర్షం

● ఆలయంలోకి ప్రవేశించిన వరద నీరు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి, తెన్‌కాశి, తూత్తుకుడి జిల్లాల్లో కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. తిరునల్వేలిలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు నుంచి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి ఈదురుగాలులు తోడవడంతో వెల్లంకుళి, కేటీసీ నగర్ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోయిల్, చుట్టుపక్కల ప్రాంతాల్లో సాయంత్రం నుంచి గంటకు పైగా భారీ వర్షం కురిసింది. దీంతో, శంకరన్‌కోయిల్‌లోని పల్లపు ప్రాంతాలైన తిరువేంగడం రోడ్డు, దక్షిణ రథ వీధి తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. ఆ ప్రాంతంలో ఉన్న శంకరనారాయణ స్వామి ఆలయంలో వరద నీరు ప్రవేశించడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. తూత్తుకుడి జిల్లాలోను ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది.



వరద నీటిలో భక్తుల ఇక్కట్లు

మదురై చిత్తిరై ఉత్సవాల్లో వెల్లివిరిసిన మత సామరస్యం



భక్తులకు రోజ్ మిల్క్ పంపిణీ చేస్తున్న ముస్లిం సోదరులు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి అమ్మవారి ఆలయ చిత్తిరై వేడుకలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ వేడుకలకు వచ్చిన భక్తులకు ముస్లింలు రోజ్ మిల్క్ సహా పలురకాల శీతల పానీయాలు అందజేశారు. ప్రపంచ ప్రసిద్ధిచెందిన మదురై చిత్తిరై వేడుకలు కోలాహలంగా సాగుతున్నాయి. గత నెల 29వ తేది ధ్వజారోహణంలో ఉత్సవాలు ప్రారంభంకాగా, ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో వివిధ వాహనాల్లో విహరిస్తున్నారు.ఈ క్రమంలో, చిన్నకడై వీధిలోని ముహైదీన్ ఆండవర్ దర్గా నిర్వాహకులు దక్షిణ ద్వారం వద్ద చలివేంద్రం ఏర్పాటుచేసి, వేడుకలకు వచ్చే భక్తులకు రోజ్ మిల్క్ అందించారు. 15 ఏళ్లుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని,హిందూ-ముస్లింలు అనే భేద భావం లేకుండా అందరూ కలసి జీవించాలనేది తమ కోరిక అని నిర్వాహకులు తెలియజేశారు.

టాస్మాక్ దుకాణం మూసివేయాలంటూ టీవీకే ధర్నా



ధర్నాలో పాల్గొన్న టీవీకే కార్యకర్తలు

ప్యారీస్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అమింజికరై షెనాయనగర్‌లో ప్రభుత్వ పాఠశాల, ఆస్పత్రి, రేషన్ దుకాణాలున్న ప్రాంతంలో టాస్మాక్ మద్యం దుకాణాలను మూసివేయాలని డిమాండ్ చేస్తూ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆధ్వర్యంలో శనివారం ఉదయం ధర్నా నిర్వహించారు. ఇక్కడ ప్రభుత్వ మహోన్నత పాఠశాల, ప్రభుత్వ బాలిక మహోన్నత పాఠశాల, ప్రభుత్వ గ్రంథాలయం, రేషన్ దుకాణాలు కూడా ఉన్నాయని, మందుబాబులు ప్రతి రోజు రోడ్డుపైనే కూర్చుని మద్యపానం చేస్తున్నారు. ఇందువల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ దుకాణాలను మూసివేయాలని కోరుతూ గత 24వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో టీవీకే నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. అయితే దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏఎస్ పళని నేతృత్వంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో, అనుమతిలేకుండా ధర్నాలో పాల్గొన్న సుమారు 300 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

8 వారాల్లో నిర్ణయం తీసుకోవాలి

అడయార్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడుకి ఇల్లు కేటాయించే అంశంపై ఎనిమిది వారాల్లో తుది నిర్ణయం తీసుకోవాలని తమిళనాడు గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖకు మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. అఖిల భారత త్యాగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీకే సెల్వం హైకోర్టులో ఒక పిటిషన్ వేశారు. మాజీ సైనికోద్యోగులకు తమిళనాడు గృహ నిర్మాణ విభాగంలో ఇళ్ళ కేటాయింపుల్లో ఒక శాతం కేటాయించారు. తాను కూడా మాజీ సైనికోద్యోగినని తనకు కూడా ఇంటిని కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాను. కానీ, ఇప్పటివరకు దానిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి పార్థసారథి సమక్షంలో విచారణకు వచ్చింది. ఇరుపక్షాల వాదనలు ఆలకించిన న్యాయమూర్తి.. స్వాతంత్ర్య సమరయోధుడుకి ఇంటిని కేటాయించే అంశంపై 8 వారాల్లో తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

డీఎండీకేలోనే ఉంటా

● మాజీ ఎమ్మెల్యే నల్లతంబి



ప్యారీస్, మే 3 (ఆంధ్రజ్యోతి): డీఎండీకేలో తనకు ఎలాంటి పదవి లేకపోయినా చివరివరకు తాను ఆ పార్టీలో సాధారణ కార్యకర్తగానే పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే నల్లతంబి స్పష్టం చేశారు. ఇటీవల సోషల్ మీడియాలో నల్లతంబి డీఎండీకే నుంచి వైదొలుగుతారని కథనాలు రావడంతో ఆయన స్పందించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ, డీఎండీకే సర్వసభ్య కమిటీలో కొత్తగా నలుగురిని ఉప ప్రధాన కార్యదర్శులుగా ఎంపిక చేశారని, ఇందులో ఒక పదవి తనకు కేటాయిస్తారని ఎదురు చూశానని, పదవి రాకపోవడంతో నిరాశ చెందినట్లు తెలిపారు. పార్టీ ఉన్నతస్థాయి కమిటీ బాధ్యతల నుంచి తనను తప్పించాలని కోరుతూ పార్టీ అధిష్టానానికి లేఖ రాశానే కానీ, పార్టీ నుంచి వైదొలుగుతున్నట్లు చెప్పలేదన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని అధికస్థానాల్లో గెలిపించేలా తాను ప్రచారంలో పాల్గొంటానని నల్లతంబి తెలిపారు.

తిరుప్పూర్‌లో భారీ జాతీయ పతాకం



భారీ జాతీయ పతాకం (పక్క చిత్రంలో) స్తంభంపై ఎగురవేసిన పతాకం

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా అగస్తీశ్వరం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాంతంలో భారీ జాతీయ పతాకం ఎగురవేయనున్నారు. ఇందుకోసం తిరుప్పూర్‌లో తయారైన జాతీయ పతాకాన్ని కన్నియాకుమిరికి తరలించారు. తిరుప్పూర్‌లో కొన్ని వారాలుగా ఈ జాతీయ పతాకం రూపొందించే పనులు చేపట్టారు. అగస్తీశ్వరం పరిధిలో పర్యాటకులను ఆకట్టుకునేలా 147 అడుగుల ఎత్తైన స్తంభంపై 20 అడుగుల ఎత్తు, 30 అడుగు పొడవుతో జాతీయ జెండా తయారుచేశారు. 22 కిలోల బరువైన ఈ పతాకం తయారీకి 25 రోజులు పట్టిందని, బుధవారం పతకాన్ని అగస్తీశ్వరానికి తరలించగా, గురువారం జెండాపై ఎగురవేశారని లైట్ ప్లస్ న్యూట్రాన్యూటికల్స్ సంస్థ యజమాని విఘ్నేష్ తెలిపారు.

చెన్నై చేరుకున్న రాష్ట్ర జాలర్లు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక కోర్టు ఉత్తర్వులతో ఆ దేశ జైళ్ల నుంచి విడుదలైన జాలర్లు, విమానంలో నగరానికి చేరుకున్నారు. రామేశ్వరానికి చెందిన 25 మంది జాలర్లు గత నెల 23వ తేది చేపల వేటకు వెళ్లారు. నడి సముద్రంలో చేపలు పడుతున్న జాలర్లను చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారని ఆరోపిస్తూ, పడవలు స్వాధీనం చేసుకుని జాలర్లను అరెస్ట్ చేసింది. జాలర్ల అరెస్టును ఖండించిన ముఖ్యమంత్రి స్టాలిన్, జాలర్లను విడిపించేలా చర్యలు చేపట్టాలని కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులతో శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయ అధికారులు, శ్రీలంక అధికారులతో చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో, జాలర్లను విడుదల చేస్తూ ఆ దేశ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయడంతో, జాలర్లను భారత దౌత్య కార్యాలయంలో అప్పగించారు. శుక్రవారం సాయంత్రం శ్రీలంక నుంచి ఎయిర్ ఇండియా విమానంలో 25 మంది జాలర్లు నగరానికి చేరుకున్నారు. జాలర్లను ఆహ్వానించిన మత్స్యశాఖ అధికారులు, ప్రత్యేక వాహనాల్లో వారిని స్వగ్రామాలకు తరలించారు.

ఘనంగా రామానుజుల జయంతి



వేలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా బ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో రామానుజ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆ సంఘ నిర్వాహకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రాజా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ మహిళా కార్యదర్శి మాలతి, కోశాధికారి రాజగోపాల్, సహాయ కార్యదర్శి విజయ రాఘవన్ తదితరులు పాల్గొని, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

● ఖైదీలకు ఆరోగ్య శిక్షణ శిబిరం



వేలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు సెంట్రల్ జైలులో ఖైదీలకు ఆరోగ్యంపై ఆ జైలు అధికారులు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఉదయం నిర్వహించిన ఈ శిబిరంలో జైలు సూపరింటెండెంట్ ధర్మరాజ్ మాట్లాడుతూ, తెలిసో, తెలియకో నేరాలు చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు వయస్సు దృష్ట్యా కొన్ని ఆరోగ్య సమస్యలు వస్తావుంటాయని దీనిని అధిగమించాలంటే ప్రతిరోజు ధ్యానం, వాకింగ్‌తో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని ఖైదీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ సతీష్, డాక్టర్ భారతి, జైలు అధికారులు రాజన్, రత్నకుమార్, మోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు క్రీడల్లో కూడా రాణించాలి

● కలెక్టర్ సుబ్బులక్ష్మి



విద్యార్థినులకు శుభాకాంక్షలు చెబుతున్న కలెక్టర్

వేలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో సమానంగా విద్యార్థినులు కూడా ప్రతి విషయంలో ముందుండాలని కలెక్టర్ సుబ్బులక్ష్మి సూచించారు. వేలూరు జిల్లా కాట్పాడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పోటీలో గెలుపొందిన విద్యార్థిణులకు బహుమతులందిచిఇ అభినందించారు. ఈ కార్యక్రమంలో 1వ వార్డు అధ్యక్షురాలు పుష్పలత, కాట్పాడి డీఎంకే అధ్యక్షుడు వేల్‌మురుగన్, మహేంద్ర, విమల శ్రీనివాసన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషనర్ కారు ఢీకొని బాలుడికి గాయాలు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలో ఎన్నికల కమిషనర్ కారు ఢీకొని దవిద్ (12) అనే బాలుడికి గాయాలైన ఘటన కలకలం రేపింది. గాయపడిన బాలుడిని చుట్టుపక్కల వారు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తల్లి మందలించిందని విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించిందని ఏడవ తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తూత్తుకుడిలో చోటుచేసుకుంది. తూత్తుకుడి భూపాలరాయపురానికి చెందిన సురేష్ కుమారుడు జో విసువా (14) అదే ప్రాంతంలోని పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో జో విసువా ఇంట్లోనే ఉంటున్నాడు. ఘటన జరిగిన రోజున విసువాకు అతని సోదరుడికి మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై ఆగ్రహించిన తల్లి విసువాను మందలించినట్లు సమాచారం. ఆవేశంతో ఇంటి వెనుక గదిలోకి వెళ్లిన విసువా తలుపులు మూశాడు. ఎంతసేపటికి బయటకు రాకపోవడంతో అనుమానించిన తల్లిదండ్రులు తలుపులు తట్టగా లోపలి నుంచి ఎలాంటి శబ్దం లేదు. దీంతో, తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళ్లగా, ఫ్యానుకు ఉరేసుకొని కనిపించాడు. ఈ ఘటనపై వడపాక్కం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

యువతిపై దాడి.. యువకుడి అరెస్టు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): తనతో మాట్లాడవద్దని చెప్పిన యువతిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కడలూరు జిల్లా విరుదాచలానికి చెందిన 19 ఏళ్ల యువతి పాత మహాబలిపురం రోడ్డు లోని ఓ విడిది గృహంలో ఉంటూ చదువుకుంటోంది. ఆమె స్వగ్రామంలో చదువుకొనే సమయంలో తన బంధువు రత్నకుమార్‌ను ప్రేమించినట్లు సమాచారం. అనంతరం ఉన్నత చదువులకు రావడంతో ప్రేమకు స్వస్తి పలికి చదువుపై ఆమె దృష్టి సారించింది. దీంతో, ఆమెను కలిసేందుకు రత్నకుమార్ యత్నించినా సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో కోయంబేడులో ఉద్యోగంలో చేరిన రత్నకుమార్, గత నెల 30వ తేది యువతికి ఫోన్ చేసి, చివరిసారిగా కలుసుకుందామని, తర్వాత తాను ఇబ్బంది పెట్టనని తెలిపాడు. అతడి మాటలు నమ్మిన యువతి, ఘటన జరిగిన రోజు సాయంత్రం పాత మహాబలిపురం రోడ్డులో ఉండగా, ఆమెను కలిసిన రత్నకుమార్, తనతో మాట్లాడడం మానొద్దని బతిమిలాడాడు. అందుకు ఆమె నిరాకరించడంతో రత్నకుమార్, తనతో తెచ్చిన క్యాన్‌లోని పెట్రోల్ ఆమెపై పోసి లైటర్‌తో వెలిగించాడు. మంటల బాధకు తట్టుకోలేక బాధిత యువతి వేసిన కేకలతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని, నీళ్లు చల్లి మంటలు ఆర్పి కేళంబాక్కంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. రత్నకుమార్‌కు దేహశుద్ధి చేసిన స్థానికులు, అతనిని తాలంబూరు పోలీసులకు అప్పగించారు.

స్వాధీనం చేసుకున్న గంజాయి దహనం



యంత్రంలో గంజాయి ప్యాకెట్లు వేస్తున్న పోలీసు అధికారులు

పెరంబూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లాలోని 25 పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు వివిధ కేసుల్లో 806 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లను కోర్టు విచారణ అనంతరం, జిల్లా పోలీసు అధికారులు తిరునల్వేలి జిల్లా నాంగునేరి సమీపం పొత్తయడి ప్రాంతంలో బయోమెట్రిక్ కర్మాగారానికి తరలించి దహనం చేశారు.

ఎలుగు దాడిలో మహిళకు తీవ్రగాయాలు



వేలూరు, మే 3 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా నాట్రంపల్లిలోని అటవీ ప్రాంతమైన కొత్తూరు గ్రామంలో శనివారం ఎలుగుబంటి ఓ మహిళపై దాడి చేసిన ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే ఆ గ్రామంలో పొలం పనిచేసుకునే అంజలి (45) అనే మహిళ పొలం పనికి బయల్దేరింది. ఆ సమయంలో అడవిలోనుంచి వచ్చిన ఓ ఎలుగుబంటి హఠాత్తుగా ఆమె దాడి చేసింది. అది చూసిన ఇరుగుపొరుగు వారు పెద్దగా కేకలు వేయడంతో ఆ ఎలుగుబంటి అడవిలోకి పారిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అంజలిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

రూ.5.32 లక్షలు పోగొట్టుకున్న వైనం

తిరుపతి(నేరవిభాగం), మే 3(ఆంధ్రజ్యోతి): ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో చిక్కి రూ.5.32 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం చిగురువాడకు చెందిన యువకుడు చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా వర్క్‌ఫ్రం హోం చేస్తున్నాడు. గతనెల 22వ తేదీ సాయంత్రం అతని మొబైల్‌లో అనుమానిత యాప్ కనిపించడంతో తొలగించాడు. వెంటనే గ్లోబల్-ఎక్స్‌ట్రా.కామ్ అనే వెబ్‌సైట్ ఓపెన్ కావడంతో బ్రౌజర్‌ను వెంటనే క్లోజ్ చేశాడు. తర్వాత ఐసీఐసీఐ బ్యాంకు అకౌంటును చెక్ చేయగా ఐదు ఆన్‌లైన్ లావాదేవీలు జరిగినట్లు గుర్తించాడు. వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వారు అతని డెబిట్ కార్డును బ్లాక్ చేశారు. మళ్లీ అతని అకౌంటును ఫ్రీజ్ చేశారు. అయితే అంతకు మునుపే అతని అకౌంటు నుంచి రూ.5.32 లక్షలు సైబర్ నేరగాళ్లు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు.

అలిపిరిలో తమిళనాడు కానిస్టేబుల్ వీరంగం

● మద్యం మత్తులో పెట్రోలింగ్ వాహన డ్రైవర్‌పై దాడి

● కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు

తిరుమల, మే3(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఓ కానిస్టేబుల్ అలిపిరి చెక్‌పాయింట్ వద్ద మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. టీటీడీకి చెందిన పెట్రోలింగ్ వాహనడ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచాడు. పోలీసు, విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాకు చెందిన కానిస్టేబుల్ ఎం.కళైసెల్వన్ శ్రీవారి దర్శనం కోసం తమ కుటుంబ సభ్యులతో కలిసి టీఎన్ 24 బీసీ 2117 నెంబరు కారులో శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో అలిపిరి తనిఖీ కేంద్రానికి చేరుకున్నారు. అయితే కళైసెల్వన్ మద్యం సేవించినట్టు తనిఖీ చేసిన సిబ్బందికి అనుమానం రావడంతో కుటుంబ సభ్యులను మాత్రమే అనుమతించి అతన్ని ఆపారు. ఇంతలో పెట్రోలింగ్ వాహన డ్రైవర్ కిరణ్ అక్కడికి చేరుకుని టోల్‌గేట్ మూసివేశామని, తిరిగి వేకువజాము రావాలని తెలిపాడు. అప్పటికే తీవ్ర ఆగ్రహంతో ఉన్న కళైసెల్వన్ 'నువ్వు ఎవడ్రా చెప్పడానికి' అంటూ ఘర్షణకు దిగాడు. ఇంతలో గేటు దాటుకున్న వారి బంధువులు కూడా తిరిగి వెనక్కి వచ్చిమరీ కిరణ్‌పై దాడికి దిగారు. ఈదాడిలో డ్రైవర్ కిరణ్ కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. గొడవను గుర్తించిన తనిఖీ కేంద్రంలో ఉన్న సిబ్బంది వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మరికొంతమంది భద్రతాసిబ్బంది సహాయంతో కిరణ్ ఆస్పత్రిలో చేర్చారు. కాగా శనివారం బాధితుడు తిరుమల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై కళై సెల్వన్‌తో పాటు తమిళ్ సెల్వి అనే మహిళా కానిస్టేబుల్, భారతి మోహన్ దాడి చేసినట్టు తెలియజేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమికి కాంగ్రెస్ నాయకత్వం వహించాలి

● ఎంపీ కార్తీ చిదంబరం



ప్యారీస్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమికి నాయకత్వం వహించే పార్టీగా కాంగ్రెస్ రావాలని కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం కుమారుడు, శివగంగ ఎంపీ కార్తీ చిదంబరం అభిప్రాయం వెలిబుచ్చారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1972 ముందు వరకు కాంగ్రెస్-డీఎంకే మధ్యే పోటీ ఉండేది. దేశానికి స్వాతంత్ర వచ్చిన అనంతరం రాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 1967వరకు వరుసగా విజయం సాధించి ప్రజలకు మంచి పాలన అందించింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల్లో ఒకడైన కామరాజర్ హయాంలో అమలుపరచిన ఉచిత విద్య, ఉచిత మధ్యాహ్న భోజనం తదితర మహోత్తరమైన పథకాలను రాష్ట్రప్రజలు ఇప్పటికి మర్చిపోలేదు. రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, ప్రధాన పార్టీలుగా డీఎంకే-అన్నాడీఎంకే బలపడ్డాయని తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ పెద్దల్లో అధికారంలోకి రావాలన్న ఆశ, తపన ఉండటంలేదని, ముఖ్యంగా రాష్ట్రప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అధికార పార్టీని నిలదీసే ధైర్యం లేదని, ప్రజల కోసం ఉద్యమించిన దాఖలాలు కూడా లేవని ఆయన వ్యాఖ్యానించారు.

సోమరితనాన్ని ఎలా క్యాష్ చేసుకోవచ్చు?

● 'యుగం' దర్శకుడు కుళంధై వేలప్పన్



మీడియా సమావేశంలో 'యుగం' బృందం

నేటితరం యువతకు భవిష్యత్‌లో తమ మొబైల్ ఫోన్లను కూడా ఆపరేట్ చేయలేనంతగా సోమరితనం ఆవహిస్తుందని, దానిని ఎలా క్యాష్ చేసుకోవాలన్న కాన్సెప్టుతో 'యుగం' వెబ్‌సిరీస్‌ను తెరకెక్కించినట్టు దర్శకుడు కుళంధై వేలప్పన్ అన్నారు. వర్టికల్ లా సినిమాస్, ట్రీ ప్రొడక్షన్స్ పతాకంపై కుళంధై వేలప్పన్ దర్శకత్వంలో వేలప్పన్, నర్మద, కవితా భారతి ప్రధాన పాత్రలు పోషించిన షార్ట్ వర్టికల్ వెబ్‌సిరీస్ 'యుగం'. దీని వివరాలను దర్శకుడు కుళంధై వేలప్పన్ వివరిస్తూ, 'ఇటీవల కేన్స్ వేదికగా జరిగిన చర్చలో భవిష్యత్‌తో వీడియో గేమ్‌లు, సినిమాల్లోనూ అనివార్యమవుతాయన్న మాటలు నాపై ప్రభావం చూపాయి. అందుకే ఈ వెబ్‌సిరీస్‌ను రూపొందించాను. ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శించాం. టొరంటో, ఇటలీలో ది బెస్ట్ వెర్టి మూవీ విభాగంలో అవార్డులు అందుకున్నాం.. ఈ వెబ్‌సిరీస్‌కు మీడియాతో పాటు ప్రేక్షకులు కూడా ఆదరించాలని కోరుతున్నాం' అని పేర్కొన్నారు. నటి నర్మద వేలప్పన్ మాట్లాడుతూ, 'ఆయనతో కొన్నేళ్ళుగా ప్రయాణం చేస్తున్నాను. ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. మా ఇద్దరికి కలిపి విజయం అందించాలన్న సంకల్పంతో ఈ కథ తయారు చేశారు. ఈ విషయంలో నాకంటే ఆయన స్నేహితులే అధికంగా సాయం చేశారు. అండగా ఉన్నారు. మీడియా కూడా కథకు సపోర్టు చేయాలని కోరుతున్నాను' అని కోరారు.

యూట్యూబర్ వీజే సిద్ధు దర్శకత్వంలో 'దయంగరం'



ఐసరి కె.గణేష్‌తో వీజే సిద్ధు

ప్రముఖ యూట్యూబర్ వీజే సిద్ధు దర్శకత్వంలో 'దయంగరం' అనే పేరుతో ఓ చిత్రం తెరకెక్కనుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఐసరి కె.గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. చిత్ర టైటిల్‌ను అధికారికంగా వెల్లడించారు. పైగా, ఈ చిత్రం పరిచయ వీడియోను ప్రముఖ నటుడు ధనుష్ రిలీజ్ చేశారు. 'వీజే సిద్ధూ వ్లాగ్స్' అనే పేరుతో యూట్యూబ్ నడుపుతున్న సిద్ధు.. 'డ్రాగన్' మూవీలో పోషించిన పాత్ర ద్వారా అభిమానుల దృష్టిని ఆకర్షించారు. బ్లాక్ షీప్ యూట్యూబ్ చానెల్ బృందం నుంచి విడిపోయిన వీజే సిద్ధు.. ఇపుడు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'దయంగరం' పేరుతో తెరకెక్కించే చిత్రంలో నటించే నటీనటుల పేర్లను వెల్లడించాల్సి ఉంది. అదేసమయంలో ఈ మూవీ టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను నటుడు ధనుష్ రిలీజ్ చేయగా, ఇందులో వీజే సిద్ధు, ఆయన యూట్యూబ్ చానెల్‌లో పని చేస్తున్న సిబ్బంది, నటుడు ఇళవరసు, నిర్మాత ఐసరి కె.గణేష్ ఉన్నారు.

16న తలపడుతున్న కోలీవుడ్ హాస్య నటులు




'సుందరా ట్రావెల్స్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

వేసవి సెలవులను క్యాష్ చేసుకునేందుకు నిర్మాతలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో తాము నిర్మించిన చిత్రాలను విడుదల చేసేందుకు పోటీ పడుతున్నారు. ఆ కోవలో ఈ నెల 16న నలుగురు హాస్య నటులు నటించిన నాలుగు కామెడీ చిత్రాలు విడుదల కానున్నాయి. వీటిలో సంతానం నటించిన 'డీడీ నెక్స్ట్ లెవల్', సూరి నటించిన 'మామన్', యోగిబాబు నటించిన 'జోరా కైతట్టుంగ' చిత్రాలు ఉండగా, ఇపుడు వీటి సరసన గతంలో మురళి, వడివేలు కలిసి నటించిన హాస్యభరిత చిత్రం 'సుందరా ట్రావెల్స్' కూడా ఉంది. 'సుందరా ట్రావెల్స్'ను రీ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల సుందర్, వడివేలు కలిసి నటించిన 'గ్యాంగర్స్' చిత్రాన్ని కొన్నేళ్ళ తర్వాత విడుదల చేయగా, ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. దీంతో ఈ నెల 16వ తేదీన సుందరా ట్రావెల్స్ చిత్రాన్ని నిర్మాతలు విడుదల చేసేందుకు ప్లాన్ చేశారు.

మార్కెట్ లేకుంటే ఇలా నడుచుకుంటారా?

● సనమ్ శెట్టి



మార్కెట్ ఉండే హీరోయిన్లతో ఒక విధంగా, మార్కెట్ లేని కథానాయికలతో మరోలా నడుచుకుంటారా? అని హీరోయిన్ సనమ్ శెట్టి ప్రశ్నించారు. ఆమె తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియో ఒకటి ఇపుడు సోషల్ మీడియాలో షేర్ అయింది. ఇందులో 'జననాయగన్' చిత్ర దర్శకుడు హెచ్.వినోద్‌ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. ఈ మూవీలో చిన్న పాత్రలో నటించాలన్నది నా ఆశ. ఇందుకోసం గత ఆరు నెలలుగా ఆ చిత్ర సహాయ దర్శకుల ద్వారా ప్రయత్నిస్తున్నాను. కానీ, నన్ను తిప్పుకుంటున్నారే గానీ వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. దర్శకుడు ఏమైనా అంతరిక్షంలో ఉన్నారా? గత 15 యేళ్ళుగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్నాను. అనేక చిత్రాల్లో హీరోయిన్‌గా నటించాను. మార్కెట్ ఉన్న నటీమణులకు మాత్రమే అవకాశం ఇస్తున్నారు. మార్కెట్ లేనివారిని తిప్పుకుంటున్నారు. ఈ పక్షపాతం నాకు ఏమాత్రం నచ్చలేదు. విజయ్ దృష్టికి తీసుకెళ్ళేందుకే ఈ వీడియో' అని పేర్కొన్నారు.





గుడ్ల నుంచి తాబేలు పిల్లలతో అటవీ సిబ్బంది - పిల్లలను సముద్రంలో వదిలిపెడుతున్న దృశ్యం

SUNDAY SPECIAL



సముద్రంలో సంచరించే అరుదైన ఆలివ్ రెడ్లీ తాబేళ్లు అంతరించే స్థితికి చేరుకున్నాయి. ఈ తాబేళ్లను సంరక్షించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. ప్రతి ఏటా తాబేళ్ల గుడ్లు సేకరించి, వాటిని ప్రత్యేకంగా భద్రపరచి, గుడ్లు నుంచి పిల్లలు వచ్చిన అనంతరం వాటిని సముద్రంలో వదిలి పెడుతున్నారు. ఆ ప్రకారం, ప్రస్తుతం 2.29 లక్షల తాబేలు పిల్లలను సముద్రంలో వదిలినట్లు రాష్ట్ర పర్యావరణ, వాతావరణ శాఖ అడిషినల్ చీఫ్ సెక్రటరీ సుప్రియ సాహు తెలిపారు.

- పెరంబూర్, ఆంధ్రజ్యోతి

ఆలివ్ రిడ్లీ గుడ్ల సేకరణ

అరుదైన తాబేళ్ల సంరక్షణ

● సాగరంలోకి చిరు కూర్మాలు

డిసెంబరు నుంచి...

తాబేళ్ల గుడ్లు పెట్టే కాలం డిసెంబరు నుంచి మే వరకు ఉంటుంది. సముద్రంలో ఉండే తాబేళ్ల గుడ్లు పెట్టడం కోసం తీరప్రాంతాలకు వస్తుంటాయి. అర్ధరాత్రి వేళ, వాతావరణం చల్లగా ఉన్న సమయంలో తాబేళ్ల సముద్రం నుంచి బయటకు వచ్చి, ఇసుకలో గుంతలు తీసి గుడ్లు పెట్టి వెళుతుంటాయి. ఒక్కో తాబేలు 100-200 వరకు గుడ్లు పెడుతుంది. ఈ గుడ్లను పక్షులు, నక్కలు, ఇతర జంతువులు ఆరగిస్తుండడంతో, అతి తక్కువ సంఖ్యలో గుడ్ల నుంచి పిల్లలు బయటకు వస్తుంటారు. ఆ పిల్లలను కూడా గద్దలు, పక్షులు ఆహారంగా స్వీకరించడంతో పదుల సంఖ్యలోనే పిల్లలు బయటపడుతుంటాయి. ఈ నేపథ్యంలో, ఆలివ్ రెడ్లీ జాతి తాబేళ్లను రక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, అటవీ, మత్స్యశాఖ, ఇండియన్ కోస్ట్ గార్డ్, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది.



గుంతల నుంచి గుడ్లు సేకరణ...

సముద్రం నుంచి తీరానికి వచ్చే తాబేళ్లు, ఇసుకలో గుడ్లు పెట్టి వెళ్తుంటాయి. తాబేళ్లకు హాని కలుగకుండా ఆయా ప్రాంతాల్లో వెదురు కర్రలు ఏర్పాటుచేశారు. తాబేలు గుడ్లు పెట్టి వెళ్లిన అనంతరం అధికారులు, కార్యకర్తలు గుంతల నుంచి గుడ్లను సేకరించి, ప్రత్యేక కేంద్రానికి తరలించి పొదిగిస్తారు. గుడ్లు సేకరణ, పొదిగించే సమయంలోనూ కొన్ని గుడ్లు దెబ్బతింటాయి. ఆయా ప్రాంతాల ఉష్ణోగ్రత, పరిస్థితుల కారణంగా గుడ్లు నుంచి పిల్లలు వచ్చేందుకు 45 నుంచి 75 రోజుల సమయం పడుతుంది.

3.19 లక్షల గుడ్లు సేకరణ...

రాష్ట్రంలోని తీర ప్రాంతాల్లో గత ఏడాది 3,19,895 గుడ్లు సేకరించారు. ఆ గుడ్ల నుంచి 2,29,432 పిల్లలు రాగా, వాటిని సముద్రంలో వదిలిపెట్టారు. కడలూరు జిల్లాలో అత్యధికంగా 81,622 పిల్లలు, మైలాడుదురైలో 38,582, చెన్నైలో 38,230 పిల్లలను సముద్రంలోకి వదిలినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది 2,15,778 పిల్లలు వదిలే అవకాశముందని తెలిపారు. ఈ ఏడాది గుడ్లు పెట్టేందుకు తీరానికి వచ్చే వందలాది తాబేళ్ల మృతిచెందాయి. తాబేళ్ల మృతి కారణంగా ఈ ఏడాది గుడ్లు సేకరణ తక్కువగా జరిగిందని వారు పేర్కొంటున్నారు.



వంకాయలతో రూపొందించిన జల్లికట్టు

కనువిందు చేస్తున్న కోతగిరి

● ప్రారంభమైన కూరగాయల ప్రదర్శన

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కోతగిరి నెహ్రూ పార్కులో 13వ కూరగాయల ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ప్రముఖ పర్యాటక కేంద్రం నీలగిరి జిల్లాకు ప్రతిరోజూ పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా, వేసవి సెలవులైన ఏప్రిల్, మే నెలల్లో పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటుంది. పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగించేలా ఉద్యానవన, వ్యవసాయ, పర్యాటక శాఖలు సహా పలు ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో పూలు, కూరగాయలు, రోజా పూల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది వేసవి సీజన్ తొలి ప్రదర్శన కోతగిరిలో ప్రారంభమైంది. శని, ఆదివారాలు జరిగే ఈ ప్రదర్శనలో వందల టన్నుల కూరగాయలతో పలురకాల నమూనాలు రూపొందించారు. అలాగే, పార్క్ ప్రాంగణంలో పలురకాల పూల చెట్లు ప్రదర్శనకు ఉంచారు. ప్రదర్శనలో రాష్ట్ర సంప్రదాయం ప్రతిబింబించేలా జల్లికట్టు ఎద్దు, తమిళ వీరుడు పోరాట పటిమ తదితర శిల్పాలు, ఆకుపచ్చ చిలుక, సీతాకోకచిలుక బొమ్మలు వంకాయలు, మిరపకాయలు, క్యారెట్ వంటి కూరగాయలతో రూపొందించి ప్రదర్శనకు ఉంచారు. అలాగే, ఉద్యానవన శాఖ, పలు జిల్లాలకు చెందిన వ్యవసాయ ఉత్పత్తులతో కూడిన 15 స్టాల్స్ ఏర్పాటుచేశారు. పిల్లలను ఆకర్షించేలా రంగురంగుల చిత్రాలు ప్రదర్శనలో ఉన్నాయి. ఇక, ప్రవేశద్వారాన్ని టన్నుల కూరగాయలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రదర్శన వీక్షించేందుకు ఉదయం నుంచే పెద్దసంఖ్యలో వచ్చిన పర్యాటకులు సెల్ఫీలు తీసుకున్నారు.







మిరపకాయలతో రామచిలుకలు - బంగాళాదుంపలు, బెండకాయలతో కర్రసాము వీరులు - వంకాయలు, క్యారెట్‌తో పక్షి నమూనా



జాతరొస్తోంది!

తిరుపతిలో మొదలైన సందడి

వైసీపీ నేతలు పాతరేసిన ఆచారాలను పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు

తిరుపతి- ఆంధ్రజ్యోతి

తిరుపతికి జాతర కళ వచ్చేసింది. చాటింపుకు ముందే పుర వీధుల్లో డప్పుల దరువు వినిపిస్తోంది. నగరంలోని మహా శక్తి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. గడిచిన ఐదేళ్లలో కరోనా కారణంగా రెండేళ్ల జాతరకు బ్రేక్ పడింది. మిగిలిన మూడేళ్ల జాతర జరిగిన తీరుపై తిరుపతి స్థానిక ప్రజల్లో విమర్శలు వినిపించాయి. స్థానిక భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా, ఆచార సంప్రదాయాలకు భంగం వాటిల్లకుండా వీఐపీ సారెలు, రాజకీయ వేషాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా జాతరను ఘనంగా నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కలర్‌ఫుల్ ఈవెంట్

కాలం మారినా.. నాగరికత పెరిగినా ఆనాదిగా వస్తున్న గంగజాతర్ల సాంప్రదాయాలు మాత్రం సీమ జిల్లాల్లో మారలేదు సరికదా వీటిని అనుసరించి పరవశించేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. తిరుపతి గంగ జాతరలో ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్న అధికారులు సైతం వేప మండలు కట్టుకొని, ముఖాన కుంకుమ, తెల్లని, నల్లని చుక్కలు పెట్టుకొని, నెత్తిన సున్నపు కుండలు పెట్టుకొని అమ్మవారి దర్శనానికి వస్తుంటారు. దేశ, విదేశాల్లో ఉద్యోగ రీత్యా స్థిరపడిన నేటి తరం యువత సైతం గంగజాతర సమయానికి తిరుపతికి చేరుకొని రకరకాల వేషాలు వేస్తుంటారు. ఈ జాతరను ఒక కలర్‌ఫుల్ ఈవెంట్‌గా ఎంజాయ్ చేస్తారు. స్త్రీని శక్తిస్వరూపిణిగా కొలిచే ఈ జాతరలకు సీమ జిల్లాలోని పట్టణాలు, పల్లెల్లో ఇదే ఆదరణ కనిపిస్తోంది.

సారెల ఊరేగింపులకు చెక్

వైసీపీ హయాంలో రెండేళ్లపాటూ సారెల ఊరేగింపులకే పెద్దపీట వేశారు. దీంతో సంప్రదాయ జాతర పక్కదారి పట్టింది. సారె వెళ్లే మార్గాల్లో వాహనదారులకు చుక్కలు కనిపించేవి. సారెతో పాటు నాయకులు, అనుచరులు ఆలయంలోకి గుంపులుగా రావడంతో సాధారణ భక్తులు క్యూలైన్లలోనే గంటల తరబడి చిక్కుకుపోవాల్సి వచ్చేది. వీటిని దృష్టిలోపెట్టుకు సారెల ఊరేగింపుల సాంప్రదాయానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. అమ్మవారికి సారెలు సమర్పించాలనుకునే గంగమ్మ భక్తులు ఆలయ కార్యాలయంలో ఇచ్చి రసీదు తీసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

6న చాటింపు

ప్రతి ఏటా ఏప్రిల్ 15 తర్వాత వచ్చే తొలి మంగళవారంతో జాతర నెల మొదలవుతుంది. తిరుపతి పొలిమేర్లలో 6వ తేది మూడవ మంగళవారం అర్ధరాత్రి వేసే చాటింపుతో గంగజాతర సంబరం మొదలుకానుంది. దీనికి ముందు ఉదయం 7 గంటలకు శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలోని విశ్వరూప స్థూపానికి అభిషేకం చేసి వడిబాల కడతారు. సాయంత్రం గంగమ్మ జన్మస్థలమైన అవిలాలనుంచి తాతయ్యగుంట గంగమ్మకు సారె వస్తుంది. ఈసారెతో పాటు స్థానిక కైకాలవాళ్లు నగర పొలిమేర్లలో చాటింపు వేస్తారు.



13న జాతర : ప్రతి ఏటా చైత్రమాసం చివరివారంలో గంగమ్మ జాతర మహోత్సవాలు వారం రోజులపాటు ఎంతో వైభవంగా జరుగుతాయి. రోజుకోవేషంతో భక్తులు చిత్ర, విచిత్రమైన అలంకారాలతో గంగమ్మను దర్శించుకుంటారు. 7వ తేది బైరాగి వేషంతో మొదలై బండవేషం, తోటివేషం, దొరవేషం, మాతంగివేషం వరకు వేషాల జాతర సాగుతుంది. 12వ తేది సున్నపుకుండలు వేషాలను ఇద్దరు కైకాల కులస్థులు వేస్తారు. వీరు చిన్న గంగమ్మ, పెద్ద గంగమ్మలకు ప్రతీకలుగా భక్తులచేత పూజలందుకుంటారు. 13వ తేది మంగళవారం అసలు జాతర సంబరం మొదలవుతుంది. ప్రత్యేక అభిషేకానంతరం వజ్రకిరీటంలో దర్శనమిచ్చే గంగమ్మను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో పోటెత్తుతారు. విశేషంగా పొంగళ్లు, జంతుబలులు ఉంటాయి. గంగమ్మ ఆలయం ముందు స్థూపానికి బంకమన్నుతో అమ్మవారి విశ్వరూపాన్ని తయారు చేస్తారు. బుధవారం వేకువజామున విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర పరిసమాప్తి అవుతుంది.

మానవత్వాన్ని, సన్మార్గాన్ని బోధించేదే శైవసిద్ధాంతం!

● అంతర్జాతీయ సదస్సులో కేంద్ర మంత్రి జేపీ నడ్డా



సదస్సు ప్రత్యేక సావనీర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి, ధర్మపురం ఆధీనం, ఎస్ఆర్ఎం వర్సిటీ వ్యవస్థాపక ఛాన్సలర్ పారివేందర్, ప్రో ఛాన్సలర్ డా. సత్యనారాయణన్ తదితరులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): శతాబ్దాలతరబడి శైవ సిద్ధాంతాలను ప్రపంచ వ్యాప్తంగా వ్యాపింపజేసిన ఘనత తమిళ పీఠాధిపతులకే దక్కుతుందని, శైవ సిద్ధాంతాలు ఎల్లప్పుడూ మానవత్వాన్ని, సన్మార్గాన్ని బోధిస్తాయని బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమం, ఎరువులు, రసాయనాల శాఖల మంతి జేపీ నడ్డా పేర్కొన్నారు. చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కుళత్తూరులో శనివారం ఎస్ఆర్ఎం శాస్త్ర సాంకేతిక విద్యా సంస్థ, ధర్మపురం ఆధీనం సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించే 6వ అంతర్జాతీయ శైవసిద్ధాంత సదస్సు ప్రారంభమైంది. ఈ సమావేశానికి ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ టీఆర్ పారివేందర్ అధ్యక్షత వహించారు. ప్రోఛాన్సలర్ సత్యనారాయణన్ స్వాగతోపన్యాసం చేశారు. ధర్మపురం ఆధీనం కైలాయ మాసిలామణి దేశిక జ్ఞాన సంబంధ పరామాచార్య స్వామి అనుగ్రహభాషణం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా మాట్లాడుతూ 'వాళగ తమిళ్, వలర్గ తమిళనాడు' (తమిళభాష వర్ధిల్లాలి... తమిళనాడు అభివృద్ధి చెందాలి) అంటూ నినాదమిచ్చారు. ధర్మపురం ఆధీనం, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం సంయుక్తంగా శైవసిద్ధాంత సదస్సును నిర్వహించడం హర్షదాయకమన్నారు. ధర్మపురం ఆధీనం ఆధ్యాత్మిక సేవలకే పరిమితం కాకుండా సామాజిక సేవలను కూడా విస్తృతంగా చేపడుతున్నట్లు తనకు తెలిసిందన్నారు. దక్షిణభారత దేశంలో దేవారం, తిరువాచకం ఇప్పటికీ జనబాహుళ్యంలో కీర్తింపబడుతోందని, శైవ సిద్ధాంతాలు మతపరమైనవి కావని అందరూ గుర్తించాలన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి మాట్లాడుతూ శైవసిద్ధాంతం తమిళజాతి గర్వించదగ్గ చిహ్నమని, శైవసిద్ధాంతంలో సామాజిక పరమైన విబేధాలు లేవని, సనాతన ధర్మమే ఆధ్యాత్మికతకు చిహ్నమని, ఇవన్నీ వసుధైక కుటుంబాన్నే చాటిచెబుతాయన్నారు. ఈ సభలోనే ఎస్ఆర్ఎం ట్రామా, ఎమెర్జన్సీ కేర్, ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్‌ఆఫ్ కార్డియాక్ సైన్సెస్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేపీ నడ్డా ప్రారంభించారు. ఈ సదస్సులో కౌలాలంపూర్ మహామారియమ్మ దేవస్థానం అధ్యక్షుడు దత్తో డాక్టర్ ఆర్. నటరాజన్, మదురై ఆధీనం హరిహర జ్ఞాన సంబంధ దేశిక పరమాచార్య స్వామి, కుండ్రక్కుడి తిరువణ్ణామలై ఆధీనం 46వ గురుమహాసన్నిధానం పొన్నంబళ అడిగళార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, తెలంగాణా మాజీ గవర్నర్ తమిళిసై, కేంద్ర మాజీ మంత్రి పొన్ రాధాకృష్ణన్, బీజేపీ జాతీయ కమిటీ సభ్యుడు హెచ్.రాజా, బీజేపీ రాష్ట్ర వ్యవహారాల కో-ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, బీజేపీ శాసనసభ్యురాలు వానతి శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

'హిట్స్' ప్రొఫెసర్‌కు 'నానో ఎనర్జీ' ప్రశంసలు



నేషనల్ తైవాన్ విశ్వవిద్యాలయం పరిశోధక బృందంతో ప్రొఫెసర్ ఇంద్రజిత్ షోవాన్ తదితరులు

చెన్నై, మే 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిందూస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (హిట్స్) కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఇంద్రజిత్ షోన్‌కు నానో ఎనర్జీ ప్రసంసలు అందాయి. నేషనల్ తైవాన్ యూనివర్శిటీకి చెందిన డాక్టర్ లి.జియోంగ్ చెన్ బృందం సహకారంతో సూర్యరశ్మి ద్వారా హానికరమైన కర్బన వాయువును విలువైన పునరుత్పాదక ఇంధనంగా మార్చే ఫోటో క్యాటలిటిక్ వ్యవస్థను రూపొందించి ప్రతిష్టాత్మక జర్నల్ 'నానో ఎనర్జీ' ప్రశంసలందుకున్నారు. ఈ వ్యవస్థ రూపకల్పన విధానాలు ఆ సంచికలో ప్రచురితమైంది. ఈ సందర్భంగా హిట్స్ వైస్ ఛాన్సలర్ కల్నల్ డా.ఎస్ఎన్ శ్రీధర మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఇంద్రజిత్ షోవాన్ హరిత రసాయన శాస్త్రంలో సరికొత్త పరిశోధన చేయడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు.